# ఎదుటి వాడికి చెప్పేటందుకే....

"ఐతే అంతేనంటారా సార్" చాలా దయనీయంగా అడిగేడు మోహన్

" ఇప్పట్లో డబ్బురాదంటారా?"

నాకు ఏమనాలో తోచలేదు. అంతవరకూ విద్యుద్దీపాలతో కళకళలాడి అప్పుడే కరెంటు కోతకు గురయిన ఊరెలా వుంది, అతని మోము.

"పది రూపాయల వడ్డీకి తెచ్చాను సార్" మోహన్ మళ్ళీ అన్నాడు "ఒకటో, రెండో కాదు పదిహేను వేల రూపాయలు".

నిజమే! దొరికిన చోటల్లా, వడ్డీకి అప్పు తీసుకున్నాడని కొందరు అనుకోవటం నేనూ విన్నాను. అతని అవసరం అలాంటిది!

సరదాగా సాయంత్రం వీధి చివరకు వెళ్ళిన మోహన్ శ్రీమతిని, సరదా కోసం స్కూటరెక్కిన, ఓ పదేళ్ళ పాప గుద్దేసింది. ఇంకేముంది! పారిశ్రామిక సంస్థలు నెలకొల్పిన ఆరోగ్య భీమా పథకమనే పదునైన నేలలో మొలకెత్తి బలిసిపోయిన పంచనక్షత్రాల అసుపత్రుల మర్రిచెట్ల నీడలో చిక్కుకుపోయి చితికిపోయారు, జీవితానికే భీమాలేని మోహన్ దంపతులు.

"న్యాయంగా రావల్సినది సాధారణముగా ఓ నెల రోజుల్లో యిస్తారనే ధైర్యంతోనే అప్పు చేసానండీ" మోహన్ కళ్ళల్లో నీళ్ళు నిండాయి. " మీకు తెలియనిది ఏముంది సార్. ఈదురుగాలికి ఎగిరిపోయే ఎండుగడ్డితో నేసిన బ్రతకులు సార్ మావి."

" నన్ను ఏమి చెయ్యమంటావ్ మోహన్" నేను సానుభూతితో అన్నాను. "జీతాల బిల్లు తప్ప మరే బిల్లూ పాస్ చెయ్యవద్దని మాకు ఆదేశాలు ఉన్నాయి. ఆర్థికంగా చాల క్లిష్టపరిస్థితిలో ఉంది కదా మన సంస్థ".

మోహన్ ఏమీ అనలేదు.

నిముషాలు గడిచిపోయాయి. నేను ఏమైనా ఆశాజనకమైన మాట చెప్తానేమోనని ఎదురుచూస్తున్నట్టు ఉన్నాడు అతను.

"పి.పి.ఎఫ్. లోనైనా తీసుకోవచ్చు కదా?" నేను అడిగేను. "ఓనెల రోజుల్లో డబ్బురావచ్చు".

"ఇంకేముందు సార్. పి.ఎఫ్.లో? మొన్ననేకదా మా అమ్మాయి పెళ్ళిగురించి మొత్తం వాడేసాను".

ఏమనాలో తోచకనేను కేబిన్ బయటకు దృష్టి మళ్ళించాను. బయట వైశాఖ మాసపు ఎండకు తట్టుకోలేక కొట్టుకుపోతోంది, శూన్యమైన ప్రపంచం.

"చూడండీ మిస్టర్ మోహన్ మీమీద నాకు సానుభూతి ఉంది. ఐనా...."

మా గుమస్తా లోనికి రావటం చూసి నేను ఆగిపోయాను.

" ఇసుక తోలే కాంట్రాక్టరు బిల్లు అడుగుతున్నాడు సార్" మా గుమస్తా లోనికి వస్తూనే అన్నాడు. "బిల్లు పాస్ చెయ్యనిదే ఇంక ఇసుక తోలలేడట."

" ఓమూడు నెలలు ఆగుతానన్నాడే" నేను ఆలోచిస్తూ అన్నాను. " ఓ నిముషం ఆగమనండి. నేను మాట్లాడతాను." గుమస్తా వెళ్ళిపోయాడు.

" ఇదండీ వరస, బిల్లులు యివ్వలేక, జవాబులు చెప్పుకోలేక చచ్చిపోతున్నాననుకోండి." నేను అన్నాను. " మీమీద సానుభూతి కొద్దీ మీ బిల్లు జి.ఎమ్. కి పంపాను. మీ అదృష్టం బాగుంటే...."

ఫోన్ మ్రోగింది జి.ఎమ్. పిలుస్తున్నారట!

మామూలుగాలేరు. జి.ఎమ్. మంచుపొరల వెనుక దాగివున్న రక్తవర్ణాన్ని దాచుకోలేని ఏర్రమందారాల్లా వున్నాయి, కళ్ళద్దాల వెనుక కనబడిన అతని కళ్ళు.

"ఏమిటిది?" అతను ఓ ఫైలు నాముందుకి విసరేదు, "ఎమిటీ ఫైలు ఏ బిల్లూ పాస్ చెయ్యవద్దని మీకెన్నిసార్లు చెప్పలేదు".

"అది... అది... ఆ బిల్లు......" చందనోత్సవము నాడు నిజరూపదర్శనమిచ్చే సింహాచలేశ్వరుడిలా మండిపోతున్న జి.ఎమ్.ని చూస్తూ ఉంటే వణుకు పుట్టుకొచ్చింది. మాటలు తడబడ్డాయి.

"చూడండీ, మిస్టర్ కుమార్. మీ సంజాయిషీలు నాకనవసరం మీకు చెప్పినట్టు చెయ్యండి."

" అది కాదు సార్ " బిల్లు వస్తుందని వడ్డీకి తీసుకొన్నారట."

" అయితే ఏమిటట? తప్పదు కదా? బిల్లు యిచ్చేస్తాం. గానీ యిప్పుడు కాదు, ఆర్థిక పరిస్థితి మెరుగుపడినప్పుడు".

నేనేమి అనలేకపోయాను. ఫైలు తీసుకున్నాను.

"చూడు మిస్టర్ కుమార్, రావుగారి బిల్లు సంగతి ఏమి చేసావ్?" కేబిన్ తలుపు తీస్తున్న నేను ఆగిపోయాను. రావుగారు మాకంపెనీకి ఆస్థాన కంట్రాక్టర్, లక్షరూపాయలపనికి రెండు లక్షలు బిల్లు చేస్తాడు ఈ మధ్యనే జి.ఎమ్. యింట్లో ఏవేవో పనులు చేసి పదిలక్షల బిల్లు పెట్టాడు.

మా జి.ఎమ్. గారు అతని భార్య యింట్లోనే అద్దెకుంటున్నారు. అద్దెతో పాటు యింటి మరమ్మత్తులు చేయటం, కర్టన్లు, తీవాచీలు, ఫర్నీచరు అన్నీ సవ్యంగా వుంచటం కంపెనీ బాధ్యతే.

"రావుగారికి కొద్దిగా యిబ్బందిగా వుందట." జి.ఎమ్. గారు మృదువుగా అన్నారు. " బిల్లు గురించి అడుగుతున్నాడు".

నాకు నువ్వు వచ్చింది. ఐదువేళ్ళలోనూ వజ్రపు ఉంగరాలు ధరించిన రావుగారు నా మదిలో కదిలేరు.

"ఏదో చూసి బిల్లు పాస్ చేసేసెయ్. వడ్డీ పోతోందట."

నిజమే! రావుగారికి వడ్డీపోతుంది. మోహన్ కి వడ్డీ పోతోంది. ఒకరికి రాబడి

అంతే మరోకరికి ఖర్చు అంతే.

జి.ఎమ్ కీ రావుగారి బిల్లుమీద యింత శ్రద్ధ ఎందుకని ఆలోచిస్తూ బయటకు నడిచాను. రావుగారి కాంట్రాక్టులో జి.ఎమ్. గారు కూడా భాగస్వామి, అని మా కార్మగారంలో కొందరు అనుకుంటూ వుంటారు. కాకపోయిన ఎదుటివాడికి చెప్పేటందుకే నీతులు అని ఎప్పటినుంచో చెప్పుకుంటున్నాము కదా?

రాఘవీస్ కోకిల ఏప్రిల్ 1996